జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 18-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 75 పేజీలు: 8 వెల : రూ.7

వయోడెక్ట్..

## అద్భుత నిర్మాణం..
# నిర్వహణకు దూరం

* శిథిలావస్థలో వయోడెక్ట్ ప్రాజెక్టు * ఈ ప్రాజెక్టుకు ఎక్కడికక్కడ లీకులు * ప్రాజెక్టు నిర్వహణను విస్మరించిన వంశధార అధికారులు * వృథాగా పోతున్న సాగునీరు

**ఆమదాలవలస, జులై 17 (వార్త):** ఆమదాలవలస పట్టణంలో వంశధార కుడి ప్రధాన కాలువకు అనుసధానంగా నిర్మించిన అద్భుతమైన నిర్మాణం వయోడెక్ట్. 2007 జూన్ 14న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖరరెడ్డి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల సాగు భూమికి నీరు అందించేందుకు నిర్మించారు. వంశధార కుడి ప్రధాన కాలువ నిర్మిస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌కు ఆటంకం కావడంతో వయోడెక్ట్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు నిర్ణయించడంతో ఈ అద్భుత నిర్మాణం పూర్తి చేశారు. రైల్వే ట్రాక్ కింద నుండి నీరు ప్రవహించేలా నిర్మించారు. రైల్వే ట్రాక్‌పై నుంచి రైళ్లు ప్రయాణిస్తుంటే.. ట్రాక్ కింద నుండి నీళ్లు ప్రవహిస్తాయి. ఇది ఆసియా ఖండంలోనే రెండో అతి పెద్ద సాగు నీటి ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును సందర్శించేందుకు జిల్లా నలుమూలల నుండి, ఇతర ప్రాంతాల నుండి అనేక మంది సందర్శకులు వస్తున్నారు. జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన వయోడెక్ట్ ప్రాజెక్టు నిర్వహణ లోపం శాపంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ లీకులు పడడంతో సాగునీరు వృథాగా పోతుంది. ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సుమారు 100 అడుగుల లోతైన బావులపై ఇనుప రేకులతో నిర్మించిన పైకప్పులు శిథిలావస్థకు చేరి పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. వయోడెక్ట్ పై నడిచేందుకు ఏర్పాటు చేసిన రహదారి రక్షణ గోడలు శిథిలమై కూలిపోతున్నాయి. వంశధార నీటి పారుదల అధికారులు పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన రహదారి మొత్తం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పేరుకు పోయాయి. అయినప్పటికీ వంశధార అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో ప్రాజెక్టు పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాజెక్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేయాలని జిల్లా రైతులు, ప్రజలు కోరుతున్నారు.









## ఎడమ ప్రధాన కాలువకు..
# గండి

**హిరమండలం, జులై 17(వార్త):** హిరమండలం మండల పరిధిలో భగరధీపురం గ్రామ సమీపంలో 1.85 కిలో మీటరు పరిధిలో ఎడమ ప్రధాన కాలువకు మంగళవారం రాత్రి గండి పడింది. ఈ విషయాన్ని రైతులు సంబంధిత అధికారులకు సమాచారం అందజేయటంతో కాలువ ద్వారా 1200 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తగ్గించి, 322 క్యూసెక్కుల నీటిని సరఫరా చేశారు. గండి పడిన ప్రదేశాన్ని గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ ఈఈ ప్రదీప్, డీఈఈ రంగనాయకులు బుధవారం చేరుకుని మట్టి వేసి పూడ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలుకలు చేసిన రంధ్రాల వల్ల కాలువకు గండిపడిందన్నారు. తక్షణమే మరమ్మత్తులు చేపట్టడం జరిగిందన్నారు. గురువారం నుంచి యధావిధిగా 1200 క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేస్తామన్నారు. ఎడమ ప్రధాన కాలువకు గండి పడటంతో పలువురు రైతుల పొలాల్లోకి నీరు చేరింది. రైతులకు ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఒకవేళ నష్టం జరిగితే వాటిని గుర్తించి పరిహారం అందేలా చూస్తామన్నారు.



# రోడ్డుపైనే... పబ్లిసిటీ బోర్డులు

* ఇరుకుగా మారుతున్న పాలకొండ రోడ్డు * నిత్యం ప్రమాదాలు * నామమాత్రపు నోటీసులకే నగరపాలక సంస్థ పరిమితం

**శ్రీకాకుళం క్రైం, జులై 17 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పలు ప్రధాన రహదారుల్లో ఉన్న షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. పబ్లిసిటీ బోర్డులు రోడ్డులపైనే పెడుతున్నారు. దీంతో రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. రోడ్డు వెడల్పు తగ్గడంతో వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారుల్లో భవనాల నిర్మాణాలు చేసే సమయంలో కింద సెల్లార్ వదిలేటట్టు నిర్మాణదారులు ప్లాన్‌ను నగరపాలక సంస్థ అధికారులకు ఇస్తున్నారు. వారు కూడా అప్రూవల్ చేస్తున్నారు. అయితే భవన నిర్మాణదారులు ప్లాన్ ప్రకారం కడుతున్నది లేనిది పర్యవేక్షించడం లేదు. దీనివల్ల రోడ్డుకు ఆనుకుని షాపుల ఎదుట వాహనాలను కొనుగోలుదారులు పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇకపై పబ్లిసిటీ బోర్డులు కూడా రోడ్డుపై ఉన్న కాలువలు దాటి ఐదడుగులు ముందుకు వచ్చి మరీ షాపుల యజమానులు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై ఎవరైనా నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు దీనిపై కొరడా ఝులిపించాల్సివున్నా పట్టించుకోవడం లేదు. దీనివల్ల వాహనచోదకులు ప్రధాన రహదారుల్లో ప్రయాణ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషుతో పాటు ట్రాఫిక్ సీఐ అవతారం దీనిపై దృష్టి సారించి రోడ్డును ఆక్రమిస్తున్న పబ్లిసిటీ బోర్డులను తొలగించేలా చర్యలు చేపట్టాలని నగరప్రజలు కోరుతున్నారు.




## భార్యపై కత్తితో దాడి



**కొత్తూరు, జులై 17 (వార్త):** అందరూ చూస్తుండగా భార్యపై భర్త కత్తితో పట్టపగలు దాడి చేసిన ఘటన కొత్తూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తూరు మండలం పారాపురం గ్రామానికి చెందిన ఉర్లపు గణపతికి భామిని మండలానికి చెందిన సావిత్రితో చాలా ఏళ్ల కిందట వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో వీరిద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. బుధవారం సావిత్రి కొత్తూరు వెళ్లింది. ఆమెతో గణపతి మాట్లాడడానికి ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో గణపతి కోపంతో కత్తితో ఆమె చాతి, కడుపుపై ఏడుసార్లు పొడిచాడు. ఆ తర్వాత నేరుగా కొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఆమెను స్థానికులు 108 వాహనంలో కొత్తూరు సామాజిక ఆరోగ్య ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కొత్తూరు ఎస్ఐ ఎంఏ అహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం





## మూతపడిన ఏటీఎం

**నరసన్నపేట/జలుమూరు, జులై17 (వార్త):** నరసన్నపేటలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గత నెల రోజులుగా ఏటీఎంలు పనిచేయకుండా మూతపడ్డాయి. బ్యాంకుకు వస్తున్న ఖాతా దారులు ఏటీఎంలు మూతపడి ఉండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. నెల రోజులైనా ఏటీఎంలను సరిచేయకపోవడంపై బ్యాంకు అధికారులపై మండిపడుతున్నారు. దీనిపై స్థానిక చీఫ్ మేనేజర్ సురేష్ వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులకు సమాచారం అందజేశామని, త్వరలో ఏటీఎంలు పనిచేసేలా మరమ్మతులు చేయిస్తామన్నారు.

# పవనిజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


*** నేటి నుంచి 28 వరకూ సభ్యత్వ నమోదు * జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి రాజు**



**సోంపేట, జులై17 (వార్త):** జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత ప్రతీ జనసైనికునిపై ఉందని జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి రాజు అన్నారు. పవన్ కల్యాణ్ పిలుపు మేరకు ఈ నెల 18 నుంచి 28 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. బుధవారం ఇచ్ఛాపురంలోని పార్టీ కార్యాలయంలో వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన కళ్యాణ్ జన సైనికులు, వీర మహిళలు కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన ఈ కార్యక్రమాన్ని ఇప్పటి వరకు జరిగిన తొలి మూడు విడతల్లో నియోజకవర్గాన్ని ముందు వరసలో నిలిపామన్నారు. గురువారం నుంచి ఈ నెల 28 వరకు జరగబోయే నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు తిప్పన దుర్యోధన రెడ్డి, బైపల్లి ఈశ్వర్‌రావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం కార్యదర్శి నాగుల హరి బెహరా, ఇచ్ఛాపురం మండల అధ్యక్షురాలు దుర్గాసి నీలవేణి రెడ్డి, కంచిలి మండల అధ్యక్షుడు డొక్కరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

### సభ్యత్వ నమోదుపై దృష్టి సారించండి

**మెళియాపుట్టి, జులై17(వార్త):** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదుపై ప్రతి ఒక్క జనసేన పార్టీ సైనికుడు దృష్టి సారించాలని ఆ పార్టీ నేత దుక్క బాలరాజు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. క్రియాశీలక సభ్యత్వ నమోదుకు ఆధార్ కార్డు, ఫోటోతోపాటు రూ.500 చెల్లించాలన్నారు. ఆయన వెంట సవలాపురం చంటి, చింతల ప్రశాంత్, పత్రి మణికంఠ ఉన్నారు.





## ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### ఎమ్మెల్యే గొండు శంకర్

**గార, జులై 17 (వార్త):** శ్రీకాకుళం నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలంలోని అయ్యవారి పేట నుంచి శ్రీకూర్మం, దల్లం వరకు వంశధార కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్లో ఏ ఒక్క రైతు సాగునీరు అందలేదనే మాట రాకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వంశధార, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించండి



**మందస, జులై 17 (వార్త):** గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ వికాసపరిషత్ అధ్యక్షుడు సవర జగన్ డిమాండ్ చేశారు. మందస పట్టణంలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ భూసమస్యలు పరిష్కరించాలన్నారు. గిరిజన భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలను ఇప్పటికే పలుమార్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆదివాసి వికాసపరిషత్ నాయకులు గణేశ్, సోములయ్య, డొంబురు, విజయ్, సోమేశ్, అబ్రహం, నారాయణరావు, నాగేశ్, వెంకటరావు, మాధవరావు, చిత్రసేను, శంకర్, రాజు పాల్గొన్నారు.

## ఆదివాసీల భూములకు రక్షణ కల్పించండి



**పోలాకి/జలుమూరు, జులై17(వార్త):** ఆదివాసీలు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి పోలాకి మండలంలోని మబుగాం క్యాంప్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. జలుమూరు మండలం మాకివలసలో గిరిజనులు సాగు చేస్తున్న భూమిపై భూసాగు హక్కు పత్రాలు అందించాలన్నారు. ఈ భూములపై ఊన సత్యనారాయణ గుప్తా దౌర్జన్యానికి, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి వాబ యోగి తీసుకువెళ్లారు. ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు.

## వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

**నరసన్నపేట/జలుమూరు, జులై 17 (వార్త):** గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని నరసన్నపేట ఎంపీడీవో జీ రామ కృష్ణారావు ఆదేశించారు. బుధవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా తామరపల్లి పంచాయతీలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున మురుగునీరు రోడ్డెక్కే అవకాశం ఉందని, కాలువల్లో పూడికలు తీయించాలన్నారు.



# 19న బాబాయ్ అబ్బాయిలకు సన్మానం

*** ఏర్పాట్లు చేస్తున్న టీడీపీ శ్రేణులు * పలువురికి ఆహ్వానపత్రాలు పంపిణీ**

*** టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషు ఆధ్వర్యంలో కార్యక్రమం**



**టెక్కలి, జులై 17 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చం నాయుడుకి ఈనెల 19న పౌర సన్మానానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మేరకు టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. గత రెండు రోజుల కిందట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కార్యకర్తల విస్తృతస్థాయి స్థాయి సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించారు. టెక్కలి నియోజవర్గానికి చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నియోజకవర్గ ఖ్యాతిని ఢిల్లీ స్థాయిలో ఎగురువేసి టెక్కలి నియోజకవర్గానికి జాతీయ చిత్రపటంలో ఉన్నత స్థానాన్ని కల్పించారు. అలాగే రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రథసారధిగా రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో టెక్కలి నియోజకవర్గం నిలిపి టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడుకు ఘనంగా సన్మానించాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికేలా వ్యూహరచన చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రముఖ నాయకులకు ఆహ్వాన పత్రాలు అందిస్తున్నారు. అలాగే టెక్కలి పట్టణానికి చెందిన వర్తక వ్యాపార వాణిజ్య ఇతర రంగాల వారు కూడా ఈ పౌర సన్మానంలో ఘనంగా సన్మానించేందుకు వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా బాబాయ్ అబ్బాయిలు టెక్కలి రావడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నారు.

స్థానిక జగతిమెట్ట నుంచి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కోళ్ల కామేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కోళ్ల లవ కుమార్, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి తదితరులు అచ్చం నాయుడుకు ఆహ్వానపత్రాన్ని అందించారు.

## ఇసుక రవాణాను అడ్డుకోండి

**నరసన్నపేట/జలుమూరు, జులై 17(వార్త):** ఇసుక, మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకోవాలని జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారి, ఏఎస్పీ గంగాధరం ఆదేశించారు. బుధవారం నరసన్నపేటలోని సెబ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గస్తీని పెంచాలన్నారు. ఎవరైనా ఇసుకను అనుమతుల్లేకుండా తరలిస్తే చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట సీఐ సతీష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.





## రహదారులపై వ్యర్థాలు వస్తే చర్యలు

**నరసన్నపేట/జలుమూరు, జులై17 (వార్త):** రహదారులపై ఇష్టారాజ్యంగా వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవని నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరెల్లి శంకర్రావు హెచ్చరించారు. బుధవారం నరసన్నపేట పట్టణంలోని రాజుల చెరువు వద్ద ఉన్న కూరగాయల దుకాణాల నిర్వాహకులు రహదారులపై వ్యర్థాలను వేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాలను ప్రత్యేకంగా చెత్తబుట్టలో ఉంచుకుంటే పంచాయతీ సిబ్బంది వాటిని సేకరిస్తారని తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రాష్ట్ర మంత్రి నాదెండ్లని కలిసిన జనసేన నాయకులు



**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):** రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు నాదెండ్ల మనోహర్‌ను ఇచ్చాపురం జనసేన నాయకులు బుధవారం మంగళగిరి పార్టీ ఆఫీసులో కలిశారు. నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి జనసేన పార్టీ జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బైపిల్లి ఈశ్వరరావు వివరించారు.



## ఆలయాల్లో ఏకాదశి పూజలు

**కంచిలి, జులై17 (వార్త):**ప్రథమ ఏకాదశి సందర్భంగా కంచిలి మండలంలో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కంచిలి కంచమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో 11 మంది దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో కంచిలికి చెందిన వైశ్య మహిళల కోలాటం ఆకట్టుకుంది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మఠం కంచిలిలో జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతా మూర్తులకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇప్పిలి కృష్ణారావు, బుద్దేపు కామేష్ రెడ్డి, దుంప రాంజీ, ఇప్పిలి ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందాలి

* వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిని పట్టించుకోలేదు
* ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
* బుడితి సామాజిక ఆసుపత్రి సందర్శన
* వైద్యులతో ఎమ్మెల్యే సమీక్ష



**సారవకోట/జలుమూరు, జులై 17 (వార్త):** బుడితి సామాజిక ఆరోగ్య ఆసుపత్రిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. వార్డుల్లోకి వెళ్లి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించా లన్నారు. ఆసుపత్రిలో వైద్య పరికరాల పనితీరు, మందుల సరఫరా తదితర విషయాలపై వైద్యాధికారులకు అడిగి తెలుసుకున్నారు. రోగులకు తక్షణ సౌకర్యాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఈ ఆసుపత్రి నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆయన వెంట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, సారవకోట మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్ పొన్నాన శంకరరావు, ఎంపీటీసీ మెండ మురళి కృష్ణ, పొన్నాన సీతారామనాయుడు, సారవకోట రామారావు, నిక్కు రామారావు, పొదిలాపు కృష్ణ, నిక్కు జనార్ధన, బోర ధనుంజయ్, పిళ్లా నందకిషోర్, దువ్వూరి జయరాం, తండ్యాల సింహాచలం, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్రుజన కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రాజకీయ బలహీన వర్గాల సదస్సు

శ్రీకాకుళం టౌన్, జులై 17(వార్త): వాయిస్ ఆఫ్ ది ఓటర్ అనే పేరుతో ఒక రాజకీయ, సామాజిక సంస్థ గురువారం ప్రారంభం కానుంది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జి పూర్ణ చంద్ర రావు ఉదయం పదకొండు గంటలకు, ఇలిసిపురం జంక్షన్ లోని డాక్టర్ అంబేద్కర్ విజ్ఞాన్ కేంద్రంలో ప్రారంభిస్తారని సంస్థ నిర్వాహకుల తరఫున సీనియర్ న్యాయవాది పాలిసెట్టి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ అతిథిగా హరిశ్చంద్రపురం మాజీ ఎమ్మెల్యే కేఏఎన్ భుక్త, గౌరవ అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి పరంజ్యోతి, జర్నలిస్ట్, కవి, రచయిత నల్లి ధర్మారావు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా రాజకీయ బలహీనవర్గాల సదస్సును కూడా నిర్వహించనున్నామన్నారు.



# గొట్టాబ్యారేజీలో.. గుర్రపుడెక్క

* వంశధార ఎగువన పేరుకుపోయిన తుప్పలు
* సాగునీటి విడుదలకు అవాంతరాలు
* చోద్యం చూస్తున్న వంశధార ప్రాజెక్టు అధికారులు

**హిరమండలం, జులై17 (వార్త):** గొట్టాబ్యారేజికి ఎగువ భాగాన గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీంతో సాగునీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడుతుంది. గొట్టాబ్యారేజికు వంశధార నది నుంచి 1100 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో పాటు గుర్రపు డెక్క గొట్టాబ్యారేజి వద్దకు చేరుతోంది. గొట్టాబ్యారేజి 22 గేట్ల పరిధిలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. గొట్టాబ్యారేజిలో డెక్కను తొలగించాలంటే తప్పనిసరిగా నీటిని బయటకు వదలాలి. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలకు అదనంగా వచ్చి చేరటం కానీ, వరద సంభవిస్తే కానీ నీరు విడిచిపెట్టే అవకాశం లేకుండా పోయింది. మొదట్లో కొద్దిగా మొదలైన డెక్క ప్రస్తుతం గొట్టాబ్యారేజి నిండా పరుచుకుంది. దీనిపై తాము ఏమి చేయలేని గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ విభాగం అధికారులు చెబుతున్నారు. పర్యాటకులకు గుర్రపు డెక్కతో గొట్టాబ్యారేజి అందంగా కనిపించినా, సాగునీటి సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. అలాగే కుడి, ఎడమ ప్రధాన కాలువల పరిధిలో కూడా గుర్రపు డెక్క అల్లుకుంది. సంబంధిత అధికారులు గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# సీపీఎస్‌ను తక్షణం రద్దు చేయండి

* ఉపాధ్యాయ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి
* ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి



**శ్రీకాకుళం టౌన్, జులై 17 (వార్త):** ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలు ఎదురుచూస్తున్న పీఆర్సీకి వెంటనే కసరత్తు ప్రారంభించాలని, ఈలోగా మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి కోరారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సమావేశం పీఎస్ఎన్ఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన మూడు నాలుగు ఐదు తరగతులను తిరిగి మాతృ ప్రాథమిక పాఠశాలలో కలపాలన్నారు. జీవో నెంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్ కుమార్ మాట్లాడుతూ సీబీఎస్ఈ సిలబస్‌ను సీబీఎస్సీ పాఠశాలలకు పరిమితం చేసి మిగిలిన అన్ని పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించవద్దన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విత్తనాన్ని పునరుద్ధరించాలని సూచించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వాలు, అధికారులు ఉద్యోగ ఉపాధ్యాయులు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న సందర్భంగా నిరంతరాయంగా ఏపీటీఎఫ్ ఉద్యమ కాగడాగా నిలబడిందని తెలిపారు. గత 76 ఏళ్లుగా ప్రభుత్వాల నిర్బంధాలను ఎదుర్కొంటూ విద్య, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సంస్థ ఏపీటీఎఫ్ అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో సమన్వయ పరుచుకుని విద్య ఉద్యోగ రంగాల సమస్యలను పరిష్కరించాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ప్రకటించి అమలు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, వివిధ యాజమాన్యాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య, సర్వీసు సమస్యలు పరిష్కరించాలని పలు తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, జి.భీమారావు, కె.గోపికృష్ణ, బి.నేతాజీరావు, కార్యదర్శులు చావలి శ్రీనివాస్, ఎస్.చాణిక్య, వి.నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, పి.తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లు బి.సుభాష్ బాబు, పైడి శ్రీరామమూర్తి, కె.విజయ కుమార్, ఎన్.నీలా మోహన్, కె.శాంతారామ్, ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శంకర్రావు, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు పి.లక్ష్మణరావు, ఏపీటీఎఫ్ పూర్వ ఉపాధ్యక్షులు బి.ప్రభావతి, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## బదిలీ ఎస్పీ రాధికకు ఆత్మీయ వీడ్కోలు

**శ్రీకాకుళం క్రైం, జులై 17 (వార్త):** సుమారు రెండున్నరేళ్లు శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా పనిచేసిన జీఆర్ రాధికకు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది బుధవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పనిచేసిన కాలంలో హెూంగార్డు నుంచి ఏఎస్పీ వరకూ మంచి సహకారం అందించారన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా చేయగలిగమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో, క్లిష్టమైన బందోబస్తు విధులు నిర్వహించడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు ప్రతి ఒక్కరి కృషి వల్ల సాధ్యమైందని, అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే అన్నింట సక్సెస్ కాగలిగామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.ప్రేమ్ కాజల్, ఉమమహేశ్వరరావు, డి.గంగాధర్, నెహ్రూ యువజన అధికారి ఉజ్వల్, డీఎస్పీలు బాలచంద్ర రెడ్డి, శృతి, త్రినాథ్ రావు, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాసరావు, శేషాద్రి, ఏఓ గోపీనాథ్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## లంపి స్కిన్ వ్యాధిపై అవగాహన

**జలుమూరు, జులై17 (వార్త):** పాడి పశువులకు వచ్చే లంపి స్కిన్ వ్యాధి పట్ల రైతులను అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ జేడీ వి.జయరాజు అన్నారు. జలుమూరు పశువైద్య కేంద్రంలో పశువైద్యులు, పశు సహాయకులతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు ఈ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పాడి పశువుల్లో ప్రబలే లంపి స్కిన్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఏ ఒక్కరినీ వదలబోం

* యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు * దొంగతనాలు చేసిన, చేయించిన వారిని వదిలిపెట్టేది లేదు * శ్రీకాకుళం డీఎస్పీ శ్రుతి

**బూర్జ, జులై 17(వార్త):** మండలంలో ఇటీవల జరిగిన పలు దొంగతనాల్లో ఎనిమిది మందిని అరెస్టు చేశామని, దొంగతనాలకు పాల్పడిన వారితోపాటు ప్రోత్సహించే వారిని ఏ ఒక్కరినీ విడిచి పెట్టేది లేదని శ్రీకాకుళం డీఎస్పి వై.శ్రుతి అన్నారు. బుధవారం కొల్లివలస జంక్షన్లో గత మూడు రోజులుగా సోలార్ పంపుసెట్లు దొంగిలించిన అసలు దొంగలను అరెస్ట్ చేయాలని ధర్నాలను నిర్వహిస్తున్న చీడివలస గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. చెడు అలవాట్లకు బానిసలైన యువత అసాంఘిక చర్యలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ధర్నా చేస్తున్న రైతులు మాట్లాడుతూ కొల్లివలసలో గంజాయి అమ్మకాలు నిర్వహించి యువతను



అనారోగ్యం పాలు చేసి అనేక దొంగతనాలకు పాల్పడి ప్రజల మధ్యనే తిరుగుతున్న నిజమైన దొంగలను విడిచిపెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దొంగతనాలకు కారకుడైన ముఠా నాయకుడిని అరెస్టు చేసేంతవరకు ఈ పోరాటం సాగిస్తామన్నారు. దీనికి డీఎస్పీ మాట్లాడుతూ చట్టం తన పని తాను చేస్తుందని పూర్తిస్థాయిలో రుజువులు, సాక్షాలు, అందినట్లయితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆమె వెంట ఎస్ఐ జీవీ ప్రసాద్ ఉన్నారు.

# రాయితీ ద్వారా గోకులం షెడ్ల నిర్మాణం

### పశు వైద్యాధికారి వెంకట్రావు

**బూర్జ, జులై 17 (వార్త):** పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని మండల పశు వైద్యాధికారి వెంకట్రావు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. షెడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చే లబ్ధిదారులకు ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీతో నిధులు మంజూరు చేయనుందన్నారు. ఆవుల షెడ్డు నిర్మాణానికి 90 శాతం, గొర్రెలు, మేకలు కోళ్లు షెడ్లు నిర్మాణానికి 70 శాతం రాయితీతో ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. రెండు ఆవుల కోసం షెడ్డు నిర్మాణం చేపడితే ప్రభుత్వ వాటాగాను 1 లక్ష 15వేల రూపాయలు యూనిట్ కాస్ట్ ఉంటుందని లబ్ధిదారుని వాటా రూ.11,500,



నాలుగు ఆవులు షెడ్డు నిర్మాణానికి యూనిట్ కాస్ట్ 1లక్షల 85 వేలు, లబ్ధిదారుల వాటా రూ.18,500లు, ఆరు ఆవులకు షెడ్ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ 2 లక్షల 30 వేలు కాగా లబ్ధిదారుని వాటా 23,000 చెల్లించవలసి ఉంటుందన్నారు. అలాగే 20 గొర్రెలు మేకలు షెడ్ యూనిట్ కాస్ట్ లక్ష 30 వేలు కాగా, లబ్ధిదారుని వాట 39,000 చెల్లించవలసి ఉంటుందని, 50 మేకలు గొర్రెలు షడ్ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రెండు లక్షల 30 వేలు కాగా, లబ్ధిదారుల వాటా 69 వేలు చెల్లించవలసి ఉంటుందని, 100 కోళ్లు పెంపకం చేపట్టే షెడ్ కు యూనిట్ కాస్ట్ 87 వేలు కాగా లబ్ధిదారుల వాటా 26 వేల ఒక వంద, రెండు వందల కోళ్ల షెడ్ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ 1.32 లక్షల కాగా లబ్ధిదారుల వాటా 39వేల 600 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ పథకం పొందేందుకు సొంత స్థలం, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం వర్తిస్తుందని, ఎస్సీ, ఎస్టి, బిసి లబ్ధిదారులకు అధిక ప్రాధాన్యత ఉంటుందని వైద్యాధికారి వెంకట్రావు తెలియజేశారు

## విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే..
# సహించేది లేదు

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* కొత్తపేట కేజీబీవీ బాలికల వసతి గృహం సందర్శన

**టెక్కలి, జులై 17 (వార్త):** కొత్తపేట గ్రామంలో కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం సాయంత్రం సందర్శించారు. ఇటీవల అతిసారంతో వైద్యచికిత్స పొందిన బాలికలతో మాట్లాడారు. ఇకమీదట జాగ్రత్త పడాలని ఎటువంటి ఇబ్బందులు వచ్చిన ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ముందుగా కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ పూజార్లు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎర్రన్నాయుడు పార్కును పరిశీలించారు. కళావిహీనంగా మారిన పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలకు ఉల్లాసాన్ని అందించే విధంగా పూర్తి స్థాయిలో ఈ పార్కును తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం రైతు బజార్‌ను సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం ధరలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్‌ను ఇంకా ఏమైనా



అభివృద్ధి చేయాలా అక్కడ ఉన్న పరిస్థితులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణయించిన ధరకే కూరగాయల అమ్మేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



### స్వచ్ఛ హిరమండలం..
# ప్రతీ ఒక్కరి బాధ్యత
### జడ్పీటీసీ బుచ్చిబాబు

**హిరమండలం, జులై 17(వార్త):** పరిసరాల పరిశుభ్రత పాటించి స్వచ్ఛ హిరమండలంగా చేసేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జెడ్పీటీసి పొగిరి బుచ్చిబాబు అన్నారు. బుధవారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో సుభలాయ్ వీధుల్లో పరిసరాలు పరిశుభ్రత, డ్రైనేజి వ్యవస్థను జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ వర్షాకాలర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి వ్యాధులు సంభవించకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. వంశధార కుడి కాలువ గట్టును పలువురు ఆక్రమించేశారన్నారు. ఇదే విషయం పంచాయతీ అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఆక్రమణలు చేపట్టిన వారిపై నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని సూచించినట్లు ఆయన తెలిపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పట్ల పంచాయతీ అధికారులు ఉదాసీనత చూపరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన వ్యాధులు దూరమవుతాయన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన సూచించారు.

## త్యాగానికి ప్రతీక మోహారం



**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):** త్యాగానికి ప్రతీక మొహరం అని ముస్లిం మత పెద్దలు అన్నారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హాజరత్ హిమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీకగా పది రోజుల పాటు నిష్టతో ప్రార్థనలు చేశారు. కస్పా కాంద్ర జంక్షన్‌లో గల మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

## కూర్మనాథపురంలో పీర్లకు పూజలు



**జలుమూరు, జులై17(వార్త):** కూర్మనాథపురంలో ముస్లింలు మొహర్రంను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పీర్లకు పూజలు చేశారు. షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం పీర్లను పల్లకీలో ఉంచి ఊరేగించారు. గ్రామస్థులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు.

## డీఐజీని కలిసిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, జులై17 (వార్త):** విశాఖపట్నం రేంజ్ నూతన డీఐజీగా గోపీనాథ్ జెట్టి బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం విశాఖపట్నం రేంజ్ డీఐజీ కార్యాలయంలో డీఐజీ గోపీనాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పచ్చని మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413